

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 141 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 22, ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# గల్లి గల్లిలో..

# గంజాయి దందా !

## మాదక ద్రవ్యాల మత్తులో యువత

డ్రగ్స్ నిర్మూలన సాధ్యమేనా

డ్రగ్స్ నియంత్రించడంలో పోలీస్ శాఖ వైఫల్యం కనిపిస్తుంది

ఉన్నతాధికారులు ఉత్తమంగా ఉన్న స్టేషన్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు

డ్రగ్స్ కట్టడి చేయడంలో అధికారుల ప్రాబల్యం తగ్గిపోతుంది

యువత జీవితాలను ఆగం చేస్తున్న మత్తు పదార్థాలు

మత్తు పదార్థాల క్రయవిక్రాయాలపై కఠినమైన చర్యలు ఎక్కడ

పాఠశాలలకు పాకిన మత్తు పదార్థాల వ్యాపకం

వయస్సు పరిమితి లేకుండా డ్రగ్స్ వాడుతున్నారు

ఆడ మగ కూడా గంజాయి వాడుతున్నారు

యువత చెడు మార్గాలకు బాటలు వేస్తున్న ప్రభుత్వాలు

హైదరాబాద్ కల్చర్ ఆగం పట్టిస్తుంది

వరంగల్ కల్చర్ వంకర బుద్ధిని నేర్పిస్తుంది

రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిస్థితి అదే రకంగా ఉంది

డాక్టర్ బరిగెల శివ







డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలుగు రాష్ట్రాల్లో గల్లి గల్లి ఒక గంజాయి బ్యాచ్చీలు తయారయ్యాయని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు.తెలుగు రాష్ట్రాల్లో శాంతిభద్రతల విఘాతానికి యువత ఆటంకాలు కల్పిస్తున్నారని తెలిపారు.పోలీస్ అధికారులకు సవాల్ విసురుతూ ఉదయమనక పగలనకా రాత్రనక మధ్య రాత్రి వేళల్లో కూడా గంజాయి సప్లై విపరీతంగా జరుగుతుందని వాటిని అరికట్టడంలో,వాటిని నియంత్రించడంలో పోలీస్ శాఖ విఫలమవుతు న్నట్టుగా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధి లేకనే గంజాయిని నియంత్రించలేకపోతున్నారని తీవ్రంగా విమర్శించారు.ప్రధాన పట్టణాలలో డ్రగ్స్ కు బానిసవుతున్న యువత వ్యాపారస్తుల జేబుల్లోనికి వేలకోట్ల రూపాయల ఖజానాను నింపుతూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారని మాయదారి డ్రగ్స్ మాయలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్న ప్రభుత్వాలు గంజాయి డ్రగ్స్ మాలికద్రవ్యాపకాలను చూసి చూడనట్లు వదిలేస్తూ ఉండడం వల్లనే పల్లెటూరు ప్రాంతాలకు కూడా మాదక ద్రవ్యాల వ్యాప్తి పెరిగిపోతుందని దానిని నియంత్రించడం పోలీస్ శాఖకు తలనొప్పిగా మారిందని గుర్తు చేశారు.సిటీ ప్రాంతాలలో నైతే రిసార్ట్ సెంటర్లలో,ఓయో రూములలో,ఫైవ్ స్టార్స్ హోటల్స్లలో మాదకద్రవ్యాల వినియోగం విపరీతంగా నడుస్తుందని ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారాలను ప్రభుత్వాలు గానీ పోలీసు యంత్రం గాని అదుపు చేయలేకపోతున్నారని దీన్నిబట్టి చూస్తే యువత ప్రాణాల కన్నా ప్రభుత్వాలకు ప్రైవేటు వ్యాపారాలే ముఖ్యం అనే విధంగా మారకద్రవ్యాల వ్యాపకాన్ని పెంపొందిస్తున్నారని తెలిపారు.ప్రతి నియోజకవర్గంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న మాదకద్రవ్యాల విక్రయాలు ఎక్కడినుండి వస్తున్నవి అనేది పోలీస్

- మిగతా 2లో..

## రిజర్వేషన్ల వివాదం తేలకముందే..

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎలా?

మేలో ఎన్నికల దిశగా కసరత్తు బీసీ రిజర్వేషన్లపై పీటముడి వీడకుండానే మరోసారి ముందుకు

ఎస్ఈసీకి సమాచారమిచ్చిన ప్రభుత్వం

6




## ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల

ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 14వ స్థానంలో మంచిర్యాల

మంచిర్యాలలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు

అటవీ విస్తీర్ణం తగ్గడమే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమంటున్న నిపుణులు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోనూ 41 డిగ్రీలు దాటిన ఎండలు

2



## గంజాయి కొనడానికి డబ్బుల్లేక...

4

హైదరాబాదులో ఇంటిపైనే పెంచుతున్న టెక్కీ!

నాచారం ఈస్ట్ గాంధీనగర్‌లో శశిధర్ అనే వ్యక్తి అరెస్ట్

అతని నుంచి 10 కేజీల గంజాయి, 17 మొక్కలు స్వాధీనం

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా...

కేసీఆర్ మరో కీలక సమావేశం ఏర్పాటు

ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో

అత్యున్నత స్థాయి సమావేశం

పార్టీని బలోపేతం చేయడమే ద

లక్ష్యంగా భేటీ

భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు

దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్

2






## నేడు కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

అభివృద్ధి పనులను ప్రారంభించనున్న వీసి ఆచార్య ప్రతాప్ రెడ్డి

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి లబ్ధి చేకూర్చబడుతుంది

ప్రధాన సమస్యల అభివృద్ధిని చేపట్టడం విశ్వవిద్యాలయానికి మేలు చేసినట్టే

ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలతో కేయూను బలోపేతం చేయాలి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## పే ఫస్ట్ - స్టడీ లేటర్: విద్యార్థులపై ఆర్థిక భారం పెరుగుతోంది : ఏబీవీపీ ఆందోళన





**వరంగల్, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. యూనివర్సిటీ శాఖ కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ ప్రాముఖ్ అంబాల కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు విద్యార్థుల నుంచి కళాశాలలు తాత్కాలికంగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని ఇచ్చిన ఆదేశాన్ని కళాశాల యాజమాన్యాలు ఒక అవకాశంగా తీసుకుని విద్యార్థులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నాయని అంబాల కిరణ్ ఆరోపించారు. ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ నిర్ణయం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్న వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారని, ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల్లో వారు ఫీజులు ఎలా చెల్లించగలరన్న సందేహం వ్యక్తం చేశారు. ఈ పథకం కేవలం పేరు మాత్రంగా మారిపోతుందనే ఆందోళన కూడా వ్యక్తం చేశారు. ఇటీవల ఫీజులు చెల్లించలేక హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను ప్రస్తావిస్తూ, ఇది విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడికి తీవ్రమైన ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు నిధులను విడుదల చేస్తూనే విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదని అన్నారు. విద్య హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏబీవీపీ తరపున ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు బలవంతపు ఫీజు వసూళ్లను నిలిపివేయాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెరుగు సాయికుమార్, ఫణీంద్ర, సాయి, హరిదాసు, సిద్దు, నాగేష్, సురేష్, ఈశ్వర్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల

**ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 14వ స్థానంలో మంచిర్యాల**
**మంచిర్యాలలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు**
**అటవీ విస్తీర్ణం తగ్గడమే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమంటున్న నిపుణులు**
**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోనూ 41 డిగ్రీలు దాటిన ఎండలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**




తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం. సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల, మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి. దీనికి తోడు 2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం, 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాజధాని హైదరాబాద్‌లోని పట్టణ ప్రాంతాలు కూడా గ్లోబల్ హీట్ లిస్టులో చేరుతున్నాయి. మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడం వల్ల ఇక్కడ వేడి ఎక్కువగా ట్రాప్ అవుతోంది. నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఎండలు దంచికొడుతున్నా.. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల ఊరట లభించే అవకాశం ఉంది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, పగటి పూట ఎండ తీవ్రత మాత్రం 40 నుంచి 45 డిగ్రీల మధ్యే కొనసాగే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# గల్లి గల్లిలో గంజాయి దందా

మొదటి పేజీ తరువాయి


అధికారులకు కూడా అంతుచిక్కకుండా నడుస్తుండనేది నమ్మశక్యంగా లేదన్నారు.సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా డ్రగ్స్ నియంత్రణను కంట్రోల్ చేయలేకపోతున్నారంటే ప్రభుత్వాలు అసమర్థత ఎంత స్పష్టంగా కనిపిస్తుందో అర్థం చేసుకోవాలన్నారు.ప్రభుత్వాలే కావాల్సి కొని యువతను మత్తు పానీయాలకు బానిసలు చేయాలనే ఉద్దేశంతో ముత్తుపానీయాలు, మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికిని ప్రభుత్వాలు పోలీసు యంత్రంగాన్ని ఆయత్త పరుస్తూ వాటిని నియంత్రించలేకపోవడం ముమ్మాటికి ప్రభుత్వాల లోపమేనంటూ వివరించారు.ఏదో పైపైన చర్యలు చేపడుతున్నామంటూ డ్రగ్స్ కొకైన్ మాదకద్రవ్యాల తయారీ కంపెనీలపై ఐపీఎస్ అధికారులచే ఉక్కు పాదం మోపకపోవడం విపరీతమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.సిటీ సెంటర్లలో ప్రధాన పోలీస్ కార్యాలయాల ప్రాంతాల్లోనే డ్రగ్స్ తయారీ కంపెనీలు ఏర్పడుతున్నాయని పలు సందర్భాల్లో అలాంటి తయారీ కంపెనీలపై అధికారులు రైట్స్ చేసినప్పటికిని కంపెనీలను సీజ్ చేసినప్పటికి భయం లేకుండా మరోచోట తయారు చేస్తూ అక్రమమైన అడ్డగోలు వ్యాపారాలను పెంపొందిస్తున్నారే తప్ప ప్రభుత్వాలకు గాని పోలీసు అధికారులకు గాని ఏమాత్రం భయపడడం లేదన్నారు.మొత్తంమీదుగా యువత జీవితాలను చదువులకు దూరం చేయడం వల్ల ఉద్యోగ అవకాశాలు కావాలని ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయకుండా ఉండడం కోసమే ఇలాంటి లోలోపల కుట్రలను బహిరంగంగా ప్రభావితం చేయబడే విధంగా ప్రభుత్వాలు పలు విధానాలను అవలంబిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు.నడిరోడ్లపై యువత గంజాయి తాగుతూ తూలుతూ గంటల తరబడి రోడ్లను ప్రజలను రవాణా సౌకర్యాలను బీభత్సంగా ఆటంకాలు కల్పిస్తూ భయాందోళనలను సృష్టిస్తుంటే ప్రభుత్వాలు గానీ పోలీసు అధికారులు కానీ కావలసినంత చర్యలు తీసుకోకపోవడం యువత జీవితాలపై ప్రభుత్వాలకు పట్టింపు లేదని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు.గంజాయి వ్యాపకం అనేది చివరకు పాఠశాల స్థాయికి చేరిపోవడం తెలుగు రాష్ట్రాల పరిస్థితి దారుణాలను సృష్టిస్తుందని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు అన్నారు.ఒకవైపు పరిపాలనాపరమైన అభివృద్ధి లేక ప్రజలు బాధపడుతుంటే మరోవైపు స్త్రీ పురుష భేదం లేకుండా విద్యార్థినీ విద్యార్థులు అనే తేడా లేకుండా సిటీ మొదలుకొని పల్లెటూరు ప్రాంతాల వరకు మాదకద్రవ్యాల జోరు పెరిగిపోతుండడం ప్రతి గ్రామానికి పదేసి బెల్ట్ షాపులు రెండు నుండి మూడు లిక్కర్ షాపులు దర్జాగా సాగించబడుతూ ప్రజల జీవితాలను లిక్కర్ మత్తులో మాదకద్రవ్యాల మత్తులో నింపుతున్నాయని వాటి వల్ల ప్రభుత్వాలకు కావలసినంత పరోక్ష ఖజానా వస్తుందని సంబరపడుతున్నారు తప్ప ప్రజల ప్రాణాలను ప్రజల జీవితాలను యువత భవిష్యత్తును యువత ప్రాణాలను నాశనం చేస్తున్నారని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అర్థం చేసుకోవడం లేదని కనీసం వాటిని పరిగణలోనికి కూడా తీసుకోకపోవడం తీవ్రమైన నేరంగా భావించాల్సి ఉంటుందన్నారు.గతంతో పోలిస్తే లిక్కర్ షాపుల పెరుగుదల ఉన్నత స్థాయికి చేరిందని గల్లి గల్లికి మత్తు పానీయాలతో పాటు గంజాయి సప్లై పెరిగిపోతుందని తీవ్రంగా హెచ్చరించారు.కొన్ని ప్రాంతాలలో కిందిస్థాయి పోలీస్ సిబ్బంది గంజాయి ముఠాలతో చేతులు కలిపి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని పలు సందర్భాల్లో అలాంటి సంఘటనలు వెలుగులోనికి వచ్చాయని అయినప్పటికిని క్రమశిక్షణతో కూడిన పోలీస్ శాఖ గంజాయి బ్యాచ్ లను మత్తు పానీయాల విక్రయదారులను సరైన స్థాయిలో పట్టుకోకపోవడం, శిక్షించకపోవడం తెలుగు రాష్ట్రాల భవిష్యత్తును అంధకారంలోనికి నెట్టివేస్తుందన్నారు.ప్రజలను ఎంత వేధించైనా ప్రభుత్వాల ఖజానాను నింపుకోవాలని చూస్తుండడం ఏదైతే ఉందో ప్రభుత్వాల అసమర్థత పరిపాలనలకు గుర్తింపుగా భావించాల్సి ఉంటుందన్నారు.యువతకు విద్యను అందించడంలో వైద్యాన్ని అందించడంలో ఉద్యోగాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలు మత్తు పానీయాలను అందించడంలో కావలసినంత సౌకర్యాల వెసులుబాటును కల్పిస్తుండడం విచిత్రంగా ఉందన్నారు.రాష్ట్రంలో ఎక్కడ చూసినా కొత్త రకపు గంజాయి వ్యాపకం మొదలైందని గంజాయి పొడిని సిగరెట్ల రూపంలో తయారుచేసి ఎక్కువ డబ్బులకు నేరుగా విద్యార్థులకు అమ్ముతున్నారని వాటిని కొనుగోలు చేస్తున్న యువత విశాలమైన ప్రాంతాల్లో ఏకాంత ప్రాంతాల్లో వాటిని స్వీకరిస్తూ ఇతర యువతీ యువకులకు సమాచారాలు చేరవేస్తూ ఒకరికొకరు డబ్బులు సంపాదన వ్యాపారాన్ని చేస్తున్నారని వాటన్నిటిని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.తెలుగు రాష్ట్రాల్లో గంజాయి వ్యాపకాలకు,వ్యసనాలకు ఎక్కువగా బానిసవుతున్న యువత ఇంజనీరింగ్ విద్యార్థులు అవుతున్నట్టు తెలిపారు.డ్రగ్స్ కు అలవాటు పడుతున్న యువత ఫార్మసీ డాక్టర్ కోర్సులు చదువుతున్నటువంటి విద్యార్థులంటూ వెల్లడించారు.కొన్నిచోట్ల ల్యాబ్ పరికరాలతో విద్యార్థులే డ్రగ్స్ సిద్ధపరచుకుంటున్నారని పెద్ద ఎత్తున సోషల్ మీడియాలలో విమర్శలు వస్తుండడం పలువిధాల అనర్థాలకు దారితీస్తున్నట్లుగా ఉందన్నారు.ఆడ మగ తేడా లేకుండా గంజాయి వాసనకు అలవాటు పడుతున్న యువత డ్రక్షను స్వీకరిస్తూ ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్న యువత పట్ల ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ వహించకపోవడం ఊహించని పరిణామాలకు దారితీస్తుందని తెలిపారు.ప్రభుత్వాల తీరు పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నప్పటికిని పోలీస్ యంత్రాంగం గంజాయి డ్రగ్స్ వ్యాపకాల నియంత్రణపై కావలసినంత శ్రద్ధ చూపకపోవడం పట్ల ప్రభుత్వాల ఒత్తిడి ఉన్నట్లుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారన్నారు.ప్రజల ఆరోగ్యాల పట్ల మేలు చేయలేని ప్రభుత్వాలు ప్రజలకు కీడు తలపెట్టే విధంగా చేస్తుండడం దానికి బదులుగా పోలీస్ శాఖను అప్రమత్తం చేయకుండా పోలీసులు తీసుకునే చర్యలకు రాజకీయ నాయకుల వృత్తిల్ల రూపంలో అడ్డుపడుతుండడం చివరకు తెలుగు రాష్ట్రాలను గంజాయి మయంగా తయారు చూస్తుండడం గమనిస్తుండగా ఐపీఎస్ అధికారుల ఉన్నత భావాలను తీవ్రంగా విమర్శల పాలు చేస్తుందని తెలుపుతూ పోలీసు ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వాల బాటలోనే నడుస్తూ అక్రమ వ్యాపకాలపై చర్యలు చేపట్టలేకపోతున్నారని గుర్తు చేశారు.దీన్నిబట్టి చూస్తే గల్లి గల్లికి గంజాయి మత్తు వాసన గుబాలిస్తుందని తీవ్రంగా ఖండించారు.ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు నిర్వహించే రాజకీయ సభలలో రాజకీయ సమావేశాలలో పాల్గొంటున్న యువత పెద్ద ఎత్తున గంజాయిని వాడుతున్నారని హెచ్చరించారు.గంజాయి నిర్మూలన ఎప్పుడు జరుగుతుందో తెలియదు గానీ అప్పటిలోగా ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందన్నది మాత్రం వాస్తవం అన్నారు.

## నేడు కేయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**అభివృద్ధి పనులను ప్రారంభించనున్న వీసి ఆచార్య ప్రతాప్ రెడ్డి**
**దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి లబ్ధి చేకూర్చబడుతుంది**
**ప్రధాన సమస్యల అభివృద్ధిని చేపట్టడం విశ్వవిద్యాలయానికి మేలు చేసినట్టే**
**ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలతో కేయూను బలోపేతం చేయాలి**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల పనులకు ప్రారంభోత్సవం జరుగుతుండడం కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మేలు జరుగుతుందని విద్యార్థి సమాజం భావిస్తుంది.నేడు కాకతీయ విశ్వవిద్యాలయంలోని పద్మాక్షి హాస్టల్ లో డైనింగ్ హాల్ నిర్మాణం కొరకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుండడం అత్యంత శుభ పరిణామం.రెండు లక్షల 50 వేల లీటర్ల రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుండడం మంచినీటి సౌకర్యానికి అత్యంత మేలు చేసిన వారు అవుతున్నట్లు విద్యార్థినిలు ఆనందపడుతున్నారు.ఎన్నో సంవత్సరాలుగా గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు కళాశాల సిబ్బందికి అధ్యాపకులకు రాకపోకల మెరుగైన సౌకర్యాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డ్ హాస్టల్స్ నుండి ఇంజనీరింగ్ కళాశాల వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం మరో శుభ పరిణామంగా భావించాల్సి ఉంటుంది.ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న ప్రధాన సమస్యల్లో ఈ మూడు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయని వీటి నిర్మాణం వల్ల విశ్వవిద్యాలయంలో కొన్ని మంచి పనులకు శ్రీకరం చుట్టపోతున్నట్లుగా కేయూ పాలన అధికారులు చేపడుతున్న అభివృద్ధి విద్యార్థులు పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తిచేయపడుతుండగా మరో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ ప్రారంభించడం అభివృద్ధి పనులు వేగం పెరుగుతున్నట్లుగా భావించనైనది.అధికారికంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోయే నేటి కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే ప్రతాపరెడ్డి,అన్ని పనులకు శంకుస్థాపన చేస్తూ తనతోపాటు పాలకమండలి సభ్యులు,రిజిస్ట్రార్ ఆచార్య వీ రామచంద్రం,ప్రిన్సిపాల్,ఆచార్య టీ మనోహర్, ఓఎస్డి ఆచార్య బి వెంకట్రామ్ రెడ్డి, కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్ రమణ,హాస్టల్స్ డైరెక్టర్లు డాక్టర్ పి శ్రీనివాస్,డాక్టర్ కే సుమలత,వరంగల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ రామిశెట్టి. రవీందర్,పి అరుణ్ కుమార్, ఇతర అధికారులు విద్యార్థులు విశ్వవిద్యాలయంలోని అన్ని వర్గాలను నేడు జరగబోయే అభివృద్ధి పనుల అధికార ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనటానికి అవకాశం కల్పిస్తూ ఆహ్వానం పలుకుతుండగా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కర్త కాకతీయ విశ్వవిద్యాలయ డెవలప్మెంట్ అధికారి ఆచార్య ఎన్ వాసుదేవ రెడ్డి,అభివృద్ధి పనుల పర్యవేక్షకులుగా హాస్టల్స్ మెస్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కంకణ బద్ధులైనారు.మంచినీటి సౌకర్యానికి కొదువ లేకుండా పద్మాక్షి హాస్టల్స్ లో అద్భుతమైన రిజర్వాయర్ నిర్మించడం కోసం తన సలహాలు సూచనలు తీసుకోవడం కోసం జియాలజీ విభాగ ఆచార్యులు ఆచార్య మల్లికార్జున్ రెడ్డి తోడ్పాటు కోసం కేయూ అధికారులు కోరడం జరిగింది.కేయూలో మొదటిసారి జరగబోయే అభివృద్ధిగా పరిగణించాల్సి ఉంటుంది.సీసీ రోడ్డు నిర్మాణానికి గత మూడు నెలలుగా తీవ్రమైన ప్రయత్నం చేస్తూ చివరకు శంకుస్థాపన వైపు అడుగులు వేయించిన ఘనత డిఓ ఆచార్య వాసుదేవ రెడ్డిదే నంటూ పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధి బలోపేతాన్ని నిరూపిస్తాయని విశ్వసిస్తూ నేడు జరగబోయే అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో ప్రతి ఒక్కరు పాల్గొని కాకతీయ విశ్వవిద్యాల అభివృద్ధిలో భాగస్తులు కావాలని కాకతీయ విశ్వవిద్యాలయ అధికార వర్గం ఆహ్వానం పలుకుతుంది.నేడు కేయూలో జరగబోతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జై భీమ్ ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్ ప్రత్యేక ఫోకస్.


INVITATION

KAKATIYA UNIVERSITY

(Accredited with 'A+' Grade by NAAC)

The Vice-Chancellor, Members of the Executive Council, the Registrar, Staff, and Students of Kakatiya University cordially invite you to the

**Foundation Stone Laying Ceremony**

for the following projects:

- Construction of Dining Hall for Girls' Hostel
- Construction of Overhead Storage Reservoir (OHSR) with a capacity of 2,50,000 litres
- Construction of Approach C.C. Road from Sports Hostel Building to KUCET

*To be laid by*

**Prof. K. Pratap Reddy**
Hon'ble Vice-Chancellor
Kakatiya University, Warangal

*Date & Time*

22nd April 2026, 11:00 a.m.

*Guest of Honour*

**Prof. V. Ramchandram**
Registrar, Kakatiya University

*In the Presence of*

**Prof. T. Manohar** — Principal, University College, KU
**Dr. P. Srinivas** — Director, University Hostels, KU
**Dr. N. Ramana** — Principal, KUCET
**Dr. K. Sumalatha** — Director, University Hostels, KU
**Sri Ramishetti Ravinder** — Deputy Executive Engineer, TGEWIDC, Warangal
**Sri. P. Arun Kumar** — Executive Engineer, TGEWIDC, Warangal
**Prof. N. Vasudeva Reddy** — Development Officer, KU

Venue: Padmakshi Girls Hostel, Kakatiya University

*Your gracious presence will be highly appreciated.*

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా...

**కేసీఆర్ మరో కీలక సమావేశం ఏర్పాటు**
**ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం**
**పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా భేటీ**
**భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది. పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీ-ఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

# మహిళా రిజర్వేషన్‌ను 2023 చట్టం ప్రకారం ప్రస్తుత 543 లోక్‌సభ సీట్లలోనే అమలు చేయాలి - ఎర్రబెల్లి స్వర్ణ




**హైదరాబాద్ /;జై భీమ్ న్యూస్ :**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలంటూ ఈ రోజు గాంధీభవన్ లో మహిళా ఆరక్షన్ బిల్ ఆజ్ కరో అభి కరో అనే నినాదంతో పోస్ట్ కార్డు పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి పీఎమ్ఓ ఆఫీస్ కి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. పార్లమెంట్ 2023 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించిన "నారీ శక్తి వందన్ అధినియమ్ 2023"ను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ కోసం కొత్త జనగణన, డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయకుండా 2023 చట్టాన్ని ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లకు వర్తింపజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల నుండే 33% సీట్లు మహిళలకు కేటాయించాలి. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర. కుల గణన లేకుండా ఎన్నికల మ్యాప్‌ను మార్చే ప్రయత్నాన్ని మేము అంగీకరించం. ఇది సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకం. 2023 మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తుత సీట్ల ప్రకారం అమలు చేసేందుకు కేంద్రం ఏ సవరణలు తీసుకొచ్చినా ఇండియా కూటమి పూర్తి మద్దతు ఇస్తుంది. 33% రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ మహిళలతో పాటు ఓబీసీ మహిళలకు కూడా సబ్-కోటా కల్పించాలి. సామాజిక న్యాయం లేని రిజర్వేషన్ అసంపూర్ణం. మహిళా సాధికారత విషయంలో మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. మాటలు చెప్పి మోసం చేయడం, "తమాషా" చేయడం మానేసి, ఆమోదం పొందిన చట్టాన్ని వెంటనే అమలు చేయాలి. 2023 చట్టం కోసం మరో 5-10 ఏళ్లు వేచి చూడాల్సిన అవసరం లేదు. దేశ మహిళల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రస్తుత 543 సీట్లలో 181 సీట్లను మహిళలకు కేటాయించి 2029 ఎన్నికలను నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం. బీజేపీ స్వార్థం కోసమే మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టింది. 2023 సెప్టెంబర్‌లోనే నారీ శక్తి వందన్ అధినియమ్ ఆమోదం పొందినా, దాన్ని వెంటనే అమలు చేయకుండా జనగణన, డీలిమిటేషన్ పేరుతో 10 ఏళ్లు వాయిదా వేయడం బీజేపీ దురుద్దేశాన్ని బయటపెడుతోంది. కుల గణన జరిగితే ఓబీసీల వాస్తవ సంఖ్య బయటపడుతుందని, సామాజిక న్యాయం కోసం డిమాండ్ పెరుగుతుందని బీజేపీ భయపడుతోంది. అందుకే కుల గణన లేకుండా డీలిమిటేషన్ చేసి, ఎన్నికల మ్యాప్‌ను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. మోదీ గ్యారంటీ అని చెప్పి మహిళలను మోసం చేసింది బీజేపీనే. బిల్లు పాస్ చేశామని చెప్పుకుంటూ, అమలు మాత్రం చేయకుండా మహిళల ఆకాంక్షలతో ఆటలాడుకుంటోంది. బీజేపీ స్వార్థ రాజకీయాల కోసం మహిళా సాధికారతను తాకట్టు పెట్టడాన్ని దేశం గమనిస్తోంది. మహిళలకు న్యాయం జరగాలంటే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి. కాంగ్రెస్ పార్టీ మహిళల పక్షాన నిలబడుతుందని అన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెల్లేటి రామకృష్ణ ఎన్నిక

**అభినందనలు తెలిపిన ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలకొట్ల జయరాం**

**హనుమకొండ, ఏప్రిల్ 19 జై భీమ్ న్యూస్ :**

హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది చెల్లేటి రామకృష్ణ ఎన్నిక కావడం పట్ల వివిధ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా మన తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కలకొట్ల జయరాం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జయరాం రామకృష్ణని పూలదండ, శాలువా తో, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. న్యాయవృత్తిలో ఆయన చూపుతున్న నిబద్ధత, సేవాభావం బార్ అసోసియేషన్ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఆయన సమర్థంగా పని చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

**న్యాయవ్యవస్థ బలోపేతానికి కృషి అవసరం**

ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ, "ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన న్యాయం అందించడంలో బార్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. చెల్లేటి రామకృష్ణ నాయకత్వంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారమవడమే కాకుండా, న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది" అని అన్నారు.

**సేవా దృక్పథంతో ముందుకు**

రామకృష్ణ గత సేవలను ప్రస్తావిస్తూ, న్యాయవాదుల హక్కుల పరిరక్షణలో, సామాజిక సేవలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయం అని తెలిపారు. యువ న్యాయవాదులకు మార్గదర్శకుడిగా నిలుస్తారని, న్యాయరంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తా : రామకృష్ణ**

తనపై చూపిన అభినందనలకు స్పందించిన రామకృష్ణ , "నాకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తాను. ప్రతి న్యాయవాది సంక్షేమం కోసం, బార్ అసోసియేషన్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తాను" అని తెలిపారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు, న్యాయవాదులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామకృష్ణ కు శుభాకాంక్షలు తెలిపారు.

**న్యాయవాదుల్లో కొత్త ఉత్సాహం**

రామకృష్ణ ఎన్నికతో హనుమకొండ జిల్లా న్యాయవాదుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆయన నాయకత్వంలో న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



# రఘునాథపల్లిలో డీసీసీబీ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**రఘునాథ్ పల్లి / జై భీమ్ న్యూస్ :**

రఘునాథపల్లి మండల కేంద్రంలో డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని వరంగల్ ఎంపి అన్నారు. రైతులు, మహిళలకు ఆర్థికంగా బలంగా నిలబడేందుకు ఇటువంటి బ్యాంకింగ్ సేవలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రఘునాథపల్లిలో బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం కావడం సంతోషకరమని, స్థానికులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ భూమిని ఆధారంగా చేసుకుని విద్యారుణాలు అందించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. బంగారు రుణాల రూపంలో ఇప్పటికే రూ.541 కోట్ల వరకు సహాయం అందించడాన్ని ప్రస్తావిస్తూ, సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్యాంకు సేవలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలని కోరారు. సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ డీసీసీబీ ఆర్థిక పరిపుష్టి కలిగిన సంస్థగా ప్రజాసేవలో, ముఖ్యంగా రైతు సేవలో ముందంజలో ఉండడం సంతోషకరమని తెలిపారు. నాబార్డ్ సహకారంతో డీసీసీబీ బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయని, ప్రతి మండలంలో ఇలాంటి బ్యాంకు ఉంటే ప్రజలకు మరింత సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అవసరమైతే వరంగల్ డీసీసీబీ బ్రాంచ్ ల పెంపు పై వరంగల్ ఎంపీ సహకారంతో ఆర్బీఐతో చర్చించి మరిన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో డీసీసీబీ ప్రథమ స్థానంలో నిలుస్తోందని, రైతులు, మహిళా సంఘాలు రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినప్పుడే బ్యాంకులకు మంచి పేరు వస్తుందని సూచించారు. రఘునాథపల్లి ప్రాంత రైతులు డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలని, ఇన్‌పుట్ (కర్షన్) లోన్లు, ఎడ్యుకేషన్ లోన్లు వంటి ప్రత్యేక రుణాలు కూడా వరంగల్ డీసీసీబీ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల రుణాలు కూడా విస్తృతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, నాబార్డ్ డి డి ఎం చంద్రశేఖర్, నాబార్డ్ డిడియం చైతన్య రవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ ఉమారాణి స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# 33 శాతం మహిళా రిజర్వేషన్ ను బేషరతుగా అమలు చేయాలి

**ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి**

**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**




హన్మకొండ పట్టణం నుండి మాస్ సావిత్రి ఒక ప్రకటన విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా మాస్ సావిత్రి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దేశ సమైక్యత సమగ్రతను విచ్ఛిన్నం చేసేందుకు దొడ్డి దారిన ప్రయత్నిస్తున్నదని ఈ క్రమంలోనే అశాస్త్రీయ పద్ధతిలో డి లిమిటేషన్ చేపట్టేందుకు 31వ రాజ్యాంగ సవరణకు తెరలేపిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు 2023లో తీసుకువచ్చిన 33% మహిళా రిజర్వేషన్ బిల్లు బేసరత్తుగా అమలు చేయాల్సింది పోయి డీలిమిటేషన్కు ముడిపెట్టి అనైక్యత సృష్టించేందుకు రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వానికి మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్న కుంటి సాకులు చెప్పకుండా 33 శాతం మహిళా రిజర్వేషన్లను బేశరత్తుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ తమిళనాడు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రాజకీయ కుట్రలకు బిజెపి ప్రయత్నిస్తున్నదని అందులో భాగంగానే భౌతిక పరిస్థితులకు అనుగుణంగా ఐక్యతను పెంపొందించే విధంగా చట్టసభలలో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉండగా దక్షిణ భారతదేశానికి హాని కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతుల్లో డీలిమిటేషన్ తీసుకురావడం దానికి మహిళా రిజర్వేషన్లు లింకు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా రాజ్యాంగాన్ని పరిరక్షించే ప్రక్రియకు పూనుకోవాలని దేశ ప్రజల మనోభావాలకు అనుగుణంగా విధానాలు రూపొందించాలని కోరారు. లేకపోతే బిజెపి మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలికే పార్టీలకు తగిన గుణపాఠంతప్పదని హెచ్చరించారు.

# కేయూ ఓ ఎస్ డి ఆచార్య వెంకటరామిరెడ్డికి ఘన సన్మానం



**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్:**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓ.ఎస్.డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా కొత్తగా నియమితులైన ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిక్షపతి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ జులసత్య, డాక్టర్ శేషు, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ దేవోజి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్కారానికి స్పందించిన ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, తనపై చూపిన గౌరవానికి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ సమగ్ర అభివృద్ధి కోసం తనవంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుదలతో పాటు విద్యా ప్రమాణాల పెంపు దిశగా కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష


**వరంగల్, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్) రాయల ప్రభాకర్ రావు సూచనలు, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో కాజిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొత్తం 11 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తులను పట్టుకోగా, అందులో 4 మంది మద్యం మోతాదుకు మించి సేవించి వాహనాలు నడిపినట్లు తేలింది. వారిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరచగా, నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. జైలు శిక్ష విధించబడిన వారు నూనావత్ సంతోష్, తేజవత్ మోహన్, ఇమ్మడి రాజు, రాయరాకుల ఓదెలు. వీరిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఇకముందు కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు హెచ్చరించారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ పని ఐపోయింది

**కాంగ్రెస్ నాయకులు బొమ్మకంటి చంద్రమౌళి**

**పరకాల / జై భీమ్ న్యూస్ :**



ఏడాదికి ఒక్కసారి బయటకు వచ్చే ప్రతిపక్ష నేతకు ప్రజలపై, ప్రజాస్వామ్యం పై ఎంత గౌరవం ఉందో అర్థం అవుతుంది.వచ్చే సారి ఈ ప్రతిపక్ష హోదా కూడా బీఆర్ఎస్ కు దక్కదు. గత పదేళ్లలో చేసిన తప్పులకు కల్వకుంట్ల కుటుంబం కటకట్లోకి వెళ్ళక తప్పదు. బీఆర్ఎస్ లో బావా, బామ్మర్దుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. హరీష్ రావు బీఆర్ఎస్ లో ఉంటారనే నమ్మకం లేదు. జీవన్ రెడ్డిని లీడర్ ను చేసిందే కాంగ్రెస్ పార్టీ.పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి 14 సార్లు బీ ఫామ్ ఇచ్చింది.ఇవాళ బీఆర్ఎస్ కూడా ఆయనకు గుర్తింపు ఇవ్వడానికి కారణం, కాంగ్రెస్ ఆయనను పెద్ద లీడర్ గా చూసి నందుకే..గతంలో కాంగ్రెస్ లో మంచి హోదాలో ఉన్న, పొన్నాల లక్ష్మయ్య, బీఆర్ఎస్ లో చేరడంతో ఇవాళ ఆయన పరిస్థితి ఎలా ఉందో, అందరికీ తెలుసు. రేపు జీవన్ రెడ్డి పరిస్థితి కూడా అంతే అవుతుంది. ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాము, మిగిలిన ఒకటి రెండు హామీలను కూడా పూర్తిచేసి మరోసారి ప్రజల మద్దతు పొందుతాము.

# ఉపాధి హామీ పనులు సమయానికి పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**





**హన్మకొండ జిల్లా/శాయంపేట, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

నిర్దేశిత లక్ష్యాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) పనులను సమయానికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులకు సూచించారు. మంగళవారం శాయంపేట మండలం మైలారం గ్రామంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా ఉపాధి హామీ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు వివరాలకు సంబంధించిన మస్టర్ రోల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూలీలు పని ప్రదేశానికి ఎప్పుడు వస్తున్నారు, ఎంతసేపు పనిచేస్తున్నారు అనే అంశాలపై విచారణ చేశారు. కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. పనుల ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలను కూడా పరిశీలించారు. తవ్విన మట్టిని రైతులు తమ పొలాల్లో వినియోగించుకుంటున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలం నేపథ్యంలో కూలీల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

**కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ**

మైలారం గ్రామంలో ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు కలెక్టర్ స్వయంగా ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూనె దివ్య, డీఆర్డీవో శ్రీను, పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఫణి చంద్ర తదితర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరంగల్ డీపీఆర్ఓ ప్రేమలతకు ఘన సన్మానం



**వరంగల్, 21 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్ఓ)గా అదనపు బాధ్యతలు స్వీకరించిన భావండ్లపల్లి ప్రేమలతను మంగళవారం పలువురు బహుజన సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. వరంగల్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ప్రేమలతకు శాలువా కప్పి సన్మానించి, పూల బొకే అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సక్రమంగా చేరేలా కృషి చేయాలని సూచించారు. ప్రేమలత తనకు అందించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలతో ప్రభుత్వం మధ్య వారధిగా పనిచేసే పౌర సంబంధాల శాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాచారాన్ని పారదర్శకంగా ప్రజలకు చేరవేయడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ మిషన్ ఐడియాలజీ హనుమకొండ జిల్లా కన్వీనర్ దండు మోహన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్, మాల సంఘాల జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పోనుగంటి లక్ష్మీనారాయణ, కో-కన్వీనర్లు వంగేటి రాజమౌళి, దండ్రే సదానందం, పోతుల కొమ్మలు, దండ్రే శ్రీనివాస్, సదువాల సారంగపాణి, దార నర్సయ్య, శేషాద్రి నాగులు తదితరులు పాల్గొని ప్రేమలతను అభినందించారు.

# 21వ శతాబ్దంలో విజయం కోసం నైపుణ్యాలే మార్గం

**కె యు వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**





**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

"అంగీకరించే లక్షణం, సర్దుబాటు చేసుకునే గుణం 21వ శతాబ్దపు కీలక నైపుణ్యాలు" అని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షతన, కామర్స్ కళాశాల సెమినార్ హాల్‌లో హైదరాబాద్ మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21 నుంచి 8 రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత ట్రైనింగ్ అండ్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో మల్టీడిసిప్లినరీ దృక్పథం అత్యవసరమని, అన్ని కోర్సులు సమాన ప్రాధాన్యం కలవని పేర్కొన్నారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించడం తో పాటు, సంబంధిత కోర్సుల్లో వృత్తి పరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు సిద్ధంగా ఉండాలని, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే విజయాన్ని సాధించగలమని తెలిపారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ లైబ్రరీ అభివృద్ధికి రూ.1 కోటి నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రతి క్యాంపస్ విద్యార్థికి సెల్ట్ సి ఈ ఎల్ టి సర్టిఫికేషన్‌ను తప్పనిసరి చేయనున్నట్లు చెప్పారు. పోటీ ప్రపంచంలో ఆత్మన్యూనత భావం వద్దని, ఎన్ఈపీ , రైజింగ్ తెలంగాణా కార్యక్రమాలు కూడా ఇదే దిశగా ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, విద్యార్థులు తమలోని బలమైన నైపుణ్యాలను గుర్తించుకుని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసుకోవాలా లేదా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలా అనే విషయంలో స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహ చారి మాట్లాడుతూ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలని, కోర్సుతో పాటు నైపుణ్యాలు కూడా సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. సభ అధ్యక్షులు, ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ, 8 రోజుల శిక్షణ కార్యక్రమంలో జీవన నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్, నిర్ణయాధికార (డెసిషన్ మేకింగ్), ఇంటర్వ్యూ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్ కుమార్ దాసరి, ఆచార్య వరలక్ష్మి, ఆచార్య అమరావేణి, డాక్టర్ ప్రగతి, డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాషాయం-ఖద్దరు-ఖాకీతో దేశాభివృద్ధి సాధ్యం

**హిందూ ధర్మ సమ్మేళనంలో పిలుపు**





**హసన్‌పర్తి, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి నగర కేంద్రంలోని భస్తీ వేదికగా హిందూ ధర్మ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా నాగమల్ల సంతోష్ కుమార్ వ్యవహరించారు. సమ్మేళనానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, హిందువుల ఐక్యతే దేశ బలమని, ఐక్యత లోపించడంతోనే గతంలో విదేశీయులు మన దేశాన్ని పాలించారని అన్నారు. డాక్టర్ హెడ్గేవార్ స్థాపించిన ఆర్ఎస్ఎస్ సంస్థ లక్ష్యం కూడా హిందూ సమాజాన్ని ఐక్యంగా నిలబెట్టడమేనని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్ విశ్వగురువుగా ఎదగాలంటే సంస్కృతి, జ్ఞానం, శక్తి పరంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. హిందువుగా గర్వించడం మాత్రమే కాకుండా, ఆ విలువలను ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబాల్లో ఐక్యత, సమాజంలో సమానత్వం పెంపొందించాలని, కులభేదాలకు తావులేకుండా అందరూ సోదర భావంతో జీవించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఈ సందర్భంగా జగద్గురు గీత ఆశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామీజీ మాట్లాడుతూ, భారతదేశంలో జన్మించడం గొప్ప భాగ్యమని తెలిపారు. ఆధ్యాత్మిక జ్ఞానం లేకపోవడమే అనేక సమస్యలకు మూలమని, మన శాస్త్రాలు, ఇతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలని అన్నారు. మన ఆలోచనలే మన శక్తిని నిర్ణయిస్తాయని, అహంకారాన్ని విడిచిపెట్టి జ్ఞానం సంపాదించాలని సూచించారు. మహిళా వక్త దేవికా రెడ్డి మాట్లాడుతూ, స్వధర్మ ఆచరణ ప్రతి మహిళ బాధ్యత అని, సనాతన సంస్కృతి మనకు మంచి విలువలను నేర్పిందని చెప్పారు. ప్రతి కుటుంబం సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులు నాగమల్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ, సనాతన ధర్మం అత్యంత పురాతనమైందని, గడప దాటితే మనమంతా హిందువులమే అనే భావన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ సమ్మేళన నిర్వాహక బృందం, భస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**





**హన్మకొండ, 21 ఏప్రిల్ 2026 (జై భీమ్ న్యూస్)**

అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. మంగళవారం శాయంపేట మండలం మైలారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి, అక్కడి సౌకర్యాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ యాప్‌లో నమోదు చేసిన బాలింతలు, గర్భిణీలు, చిన్నారుల వివరాలను పరిశీలించి, హాజరు వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులతో ఆంగ్ల పద్యాలు చదివించి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు సమర్థవంతంగా అందేలా చూడాలని సూచించారు. వన నిర్మాణానికి సంబంధించిన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించి, పూర్తయిన టాయిలెట్లకు రంగులు వేయాలని, పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలి. మైలారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ నిల్వలు, విద్యుత్ దీపాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూనె దివ్య, పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీవో ఫణి చంద్ర, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కొనడానికి డబ్బుల్లేక...

**హైదరాబాదులో ఇంటిపైనే పెంచుతున్న టెక్కీ!**
**హైదరాబాద్‌లో గంజాయి సాగు చేస్తూ పట్టుబడి టెక్కీ**
**నాచారం ఈస్ట్ గాంధీనగర్‌లో శశిధర్ అనే వ్యక్తి అరెస్ట్**
**గంజాయి కొనేందుకు డబ్బులు లేకపోవడంతో తానే పండించడం మొదలుపెట్టిన వైనం**
**అతని నుంచి 10 కేజీల గంజాయి, 17 మొక్కలు స్వాధీనం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి, గంజాయి కొనేందుకు డబ్బుల్లేక ఏకంగా ఇంటిపైన గంజాయి పండించడం మొదలుపెట్టాడో టెక్కీ. ఈ అనూహ్య ఘటన హైదరాబాద్‌లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం, నాచారం ఈస్ట్ గాంధీనగర్‌కు చెందిన సి. శశిధర్ అనే వ్యక్తి తన ఇంటి టెర్రస్‌పై గంజాయి సాగు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శశిధర్ ఇంటిపై దాడి చేసిన పోలీసులు, అక్కడ పదుల సంఖ్యలో గంజాయి మొక్కలు ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. టెర్రస్‌పై పెంచుతున్న 17 గంజాయి మొక్కలతో పాటు, సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన శశిధర్, ఆ తర్వాత ఉద్యోగం మానేశాడు. గంజాయికి అలవాటుపడిన అతనికి, కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో తానే స్వయంగా పండించాలని నిర్ణయించుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు శశిధర్‌ను అరెస్ట్ చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్లాస్టిక్‌కు గుడ్‌బై... పచ్చదనానికి హాయ్

**హనుమకొండలో ప్లాస్టాసురుడుతో వినూత్న ఉద్యమం**




**హన్మకొండ, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా హనుమకొండలో అరుదైన, వినూత్న కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు. ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం అనే స్ఫూర్తితో శ్రీరామ్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీ) మరియు 104.8 ఎఫ్ఎం మీ ఎఫ్ఎం వరంగల్ సంయుక్తంగా మడికొండలోని 'ఈనాడు' కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో బాధ్యతను పెంపొందించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్లాస్టాసురుడు అనే థీమ్ ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టాసురుడు రూపంలో ఏర్పాటు చేసిన ప్రతీక ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను సృజనాత్మకంగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ వద్ద ఉన్న 10 ప్లాస్టిక్ వస్తువులను సమర్పించి, ప్రతిగా ఒక మొక్కను ఉచితంగా తీసుకెళ్లే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేశారు. ఈ ఆలోచన ప్రజలను ఆకట్టుకుని, పెద్ద సంఖ్యలో పాల్గొనడానికి ప్రేరేపించింది. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, బుధవారం జరగనున్న ధరిత్రి దినోత్సవం నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రకృతికి కలిగే నష్టాలను గుర్తించి, వాటిని తగ్గించేందుకు మనం కలిసికట్టుగా కృషి చేయాలి. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత మార్గాలను అవలంబిస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి" అని పిలుపునిచ్చారు. అలాగే ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ మరియు మీ ఎఫ్ఎం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదం చేస్తాయని తెలిపారు. హనుమకొండ ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఈనాడు ప్రతినిధులు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సభ్యులు, మీ ఎఫ్ఎం టీమ్, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక ప్రయత్నంగా నిలిచింది.

## ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు

**ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహణ**

**వరంగల్, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకత్వంలో ఈ నెలకు సంబంధించిన తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎమ్)ను ఈ నెల 23వ తేదీన రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థ పాఠశాలలు, కేజీబీవీలు, టీజీ మోడల్ పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి. రంగయ్య నాయుడు తెలిపారు. ఈ నెల సమావేశానికి వేసవి సెలవుల సమయంలో పిల్లలతో అనుబంధాన్ని పెంపొందించడం అనే థీమ్‌ను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు సమావేశాలను సమర్థవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులకు ముందుగానే విద్యార్థుల ద్వారా లిఖితపూర్వక ఆహ్వానాలు పంపించి, శాతం వంద హాజరు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో సమావేశాలకు హాజరు కాని తల్లిదండ్రులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి హాజరును నిర్ధారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు, పట్టణాల్లో ఉద్యోగాల దృష్ట్యా తల్లిదండ్రులకు అనుకూల సమయాన్ని నిర్ణయించి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశ తేదీ, సమయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ ఆహ్వాన పత్రాలు పంపించడంతో పాటు తల్లిదండ్రులు తమ మొబైల్ ఫోన్లతో హాజరుకావాలని సూచించారు. పాఠశాల విద్యా యాప్ ద్వారా అవసరమైన పీటీఎమ్ వనరులను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవాలని, విద్యార్థుల నమోదు మరియు హాజరు మెరుగుపడేందుకు తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా పురోగతిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేర్చాలని పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించిన నిమిషాలను తప్పనిసరిగా నమోదు చేసి, అనంతరం యాప్‌లో తేదీ, ఆహ్వాన విధానం, మొత్తం నమోదు సంఖ్య, లక్ష్య తల్లిదండ్రుల సంఖ్య, హాజరైన వారి వివరాలతో పాటు ఫోటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఈ సమావేశాలకు హాజరై నిర్వహణను పర్యవేక్షించాల్సిందిగా సూచించారు.

**వేసవి సెలవులపై సూచనలు...**

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ప్రతిరోజూ పునశ్చరణ చేయడం, పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అవసరమని తెలిపారు. అధిక వేడి సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ తగిన ఆహారం, నీరు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల చదువు, ఆరోగ్యం, క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం తల్లిదండ్రులు చురుకుగా పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి విజ్ఞప్తి చేశారు.

## మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష

**రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**

**వరంగల్, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**



జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నర్సంపేట ప్రాంతానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లు మరియు నిల్వలపై ముఖ్య సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న పంటకు అధిక దిగుబడి వచ్చిందని తెలిపారు. సుమారు 72 వేల ఎకరాల్లో సాగు చేసిన ఈ పంటకు సుమారు 2.25 మెట్రిక్ టన్నుల దిగుబడి నమోదైందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని, నిల్వ సదుపాయాలు సరిపడా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ద్వారా తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. రైతుల నుంచి మొక్కజొన్నను ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని, మద్దతు ధర చెల్లింపులు సమయానికి జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేయడానికి గోదాముల్లో తగిన ఏర్పాట్లు చేయాలని, నిల్వ సమయంలో నాణ్యత పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, అగ్రికల్చర్ జెడి అనురాధ, డిసిఓ నీరజ, డీఎం మార్క్‌ఫెడ్ రంజిత్ రెడ్డి, సంబంధిత మండలాల తహసిల్దార్లు, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## హాష్ అయిల్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు

**కోట్ల విలువ గల హాషీష్ ఆయిల్ స్వాధీనం**




**వరంగల్ ఏప్రిల్ 21/2026 జై భీమ్ న్యూస్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతంలో ఎప్పుడు లేని తోలిసారిగా భారీ స్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుండి తీసిన నూనె) స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాలోని నలుగురు సభ్యులను వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా కలసి అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 2 కోట్ల 50లక్షల విలువ గల హాష్ ఆయిల్‌తో రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. హంటల్ సన్ను (23),సువ్వపల్లి గ్రామం,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం, 2.హంటల్ సన్యాసి (23), రేకపల్లి,,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రం, 3. కండెల చిన్నబాబు (56), దారకొండ గ్రామం,గూడెం మండలం, అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, 4.కష్ణా హంటల్ (56),రేకపల్లి,,చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా,ఒడిషా రాష్ట్రానికి చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీ వున్నాడు.ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను తెలియజేస్తూ పట్టుబడిన నిందితులందరు పరిచయస్తులు కాగా, ఇందులో ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగితా నిందితుల ద్వారా విక్రయించి సోమ్ము చేసుకుని జల్సాలకు చేసేవారు. కాని నిందితులకు గంజాయి విక్రయాలలతో వచ్చే డబ్బు వారి జల్సాలకు సరిపోకపోవడంతో ప్రధాన నిందితుడు గంజాయి మొక్కల నుండి హాష్ అయిల్‌ను తయారు చేసే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో వున్న కిలో పాండు నిందితుడితో పరిచయం కావడంతో, పాండు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గంజాయి మొక్కలను పెంపకం చేపట్టిన అనంతరం, నిందితుడు పాండు తీసుకవచ్చిన పరికరం ద్వారా ఈ ముఠా సభ్యులు గంజాయి మొక్కలను ద్వారా 40కిలోల హాష్ అయిల్‌ను సేకరించారు. ఈ విధంగాంగా తయారు చేసిన హాష్ అయిల్‌లో 20కిలోల హాష్ అయిల్‌ను పాండు తను తీసుకోగా, మిగితా 20కిలోల హాష్ అయిల్‌ను కిలో చోప్పున ప్యాకేట్లలో భద్రపర్చి పట్టుబడిన నిందితడులందరు ఐదు కిలోల చోప్పున హాష్ అయిల్‌ను తీసుకోని ముంబాయిలో విక్రయించేందుకు ఆంధ్రప్రదేశ్ తుని రైల్వే స్టేషన్ నుండి ఈ నెల 19 తేది అర్ధరాత్రి కోనార్క్ రైలులో బయలు దేరారు. వరంగల్ రైల్వేలో పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా ముఠా అనుమానం రావడంతో ఈ ముఠా సభ్యులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిన్నటి రోజు దిగిన నిందితులు ఈ రోజు ఉదయం ముంబాయి వేళ్ళేందుకు ఈ ముఠా సభ్యులు ఈ రోజు ఉదయం వరంగల్ బస్టాండ్ వద్ద వున్న రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమాస్పదంగా తిరుగున్నాట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్ళి నిందితులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారివద్ద హాష్ అయిల్‌ను గుర్తించిన పోలీసులు నిందితులను అరెస్టు చేసిన 20కిలోల హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున హాష్ అయిల్‌తో పాటు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, వరంగల్ ఏఎప్పీ శుభం, ఏసిపి లు జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, డ్రగ్ కంట్రోల్ టీం ఇన్స్‌స్పెక్టర్ వై.సతీష్,ఇంతేజార్‌గంజ్ ఇన్స్‌స్పెక్టర్ షూకూర్, ఎస్.ఐలు సందీప్, తేజ ఆర్.ఎస్.ఐలు ఏ.పూర్ణ చందర్ రెడ్డి,కె.మనోజ్ రెడ్డి, ఎల్.లింగారావు,క్యాట్ పార్టీ ఏ.ఆర్.ఏ.ఎస్.ఐలు వి.సుబ్బిరామి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళు బాల రాజు, కె.శ్రీరాములు, యం.డి రబ్బానీ, ఆర్.రాజ్‌కుమార్‌తో పాటు ఇంతేజార్‌గంజ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## భద్రకాళి అమ్మవారి కళ్యాణ బ్రహ్మోత్సవాలలో మహా అన్నదానంలో పాల్గొన్న అరూరి రమేష్





**వరంగల్, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చారిత్రాత్మక ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమంలో సమర్పణలు చేశారు. అదేవిధంగా అమ్మవారి మకర వాహన సేవలో పాల్గొని, ఉత్సవాలను దగ్గరగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోగా, నాదస్వరాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో అరూరి రమేష్ పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులతో కలసి భోజనం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శంకరాచార్యులు, భగవత్ రామానుజాచార్యుల జయంతి ఉత్సవాలలో నాయిని నీలిమారెడ్డి





**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండ రాగన్న దర్వాజా ప్రాంతంలోని బ్రాహ్మణ భవనంలో మంగళవారం (21-04-2026) వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా ఆది శంకరాచార్యులు, భగవత్ రామానుజాచార్యుల జయంతి ఉత్సవాలు ఒకే వేదికపై వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణ, వైష్ణవ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి నరసింహాచార్యులు, శ్రీమన్నారాయణాచార్యులు, శ్రీధరాచార్యులు, శ్రవణ కుమారాచార్యులు సహా సుమారు 20 మంది వైష్ణవ, స్మార్త ఆగమ పండితులు పాల్గొన్నారు. ఉభయ వేదాంత ఆచార్యులకు చోడశోపచార పూజలు, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం సుమారు 200 మంది బ్రాహ్మణ మహిళలు, వేద పండితులకు పట్టు వస్త్రాలు, చీరలు, కండువలు పంపిణీ చేశారు.

## హైదరాబాద్‌లో ప్రాణాలు తీసిన రీల్స్ వ్యామోహం

**రీల్స్ చేస్తూ కిందపడిన 14 ఏళ్ల బాలుడు**
**రెయిలింగ్‌పై ఫీట్స్ చేస్తుండగా కిందపడిన బాలుడు**
**నాచారం, మల్లాపూర్ గాంధీ బొమ్మ సమీపంలో విషాదం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సోషల్ మీడియా రీల్స్ వ్యామోహం ఒక బాలుడి ప్రాణాలు తీసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో రీల్స్ ద్వారా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన 14 ఏళ్ల బాలుడు మిథున్ ప్రమాదకర స్టంట్స్‌కు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్, నాచారంలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ సమీపంలోని బస్తీలో ఉంటున్న మిథున్ తన ఇంటి వద్ద బాల్కనీ రెయిలింగ్‌పై ఫీట్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిథున్ మృతి చెందడంతో అతని కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**



**వరంగల్ ఏప్రిల్ 21/2026 (జై భీమ్ న్యూస్)**

పోలీస్ అధికారులకు పదోన్నతులతో పాటు బాధ్యతలుకూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. వరంగల్, జనగామ ఏ.ఎస్పీగాలు పనిచేస్తూ పరిపాలన విభాగం అదనపు ఎస్పీలుగా పదోన్నతులపై బదిలీపై వెళ్తున్న ఏ.ఎస్పీలు, శుభం ప్రకాష్, చేతన్ నితిన్‌లను మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన డిసిపిలు, ఎసిపిలు, ఇతర పోలీస్ అధికారులు బదిలీపై వెళ్తున్న ఇరువురు ఏ.ఎస్పీలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న ఇరువురు అధికారులకు అభినందనలు తెలియజేస్తూ ఇరువురు అధికారులు అప్పగించిన పనులు సమర్ధవంతంగా నిర్వహించడంతో పాటు, నేరాల నియంత్రణలో వారి ప్రత్యేకత చాటుకున్నారని, అదే విధంగా శాంతి భద్రత విషయంలో ఇరువురు అధికారులు సంబందిత అధికారుల సమన్వయంతో పనిచేస్తు చక్కటి ఫలితాలను రాబట్టగలిగారని, అదే విధంగా వీరు తీసుకున్న నిర్ణయాలతో ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, ప్రజల అభిమానాన్ని సంపాదించారని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో డిసిపిలు అంకిత్‌కుమార్, రాజమహేంద్రనాయక్, ధార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనీషా నేహ్రా, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్‌తో పాటు, సంబంధిత డివిజన్లకు చెందిన ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, సబ్-ఇన్స్‌స్పెక్టర్లు పాల్గోన్నారు.

## తెలంగాణ హై కోర్టు తాత్కాలిక నిర్ణయం విద్యార్థులకు శాశ్వత భారం

**"పే ఫస్ట్ - స్టడీ లేటర్: ఇదేనా ప్రభుత్వ విద్యా విధానం?"**

**ఏబివిపి స్టేట్ యూనివర్సిటీస్ ప్రాముఖ్ అంబాల. కిరణ్**




**కాకతీయ యూనివర్సిటీ ఏప్రిల్ 21/2016 (జై భీమ్ న్యూస్)**

ఈరోజు కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకతీయ యూనివర్సిటీ శాఖ కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ ప్రాముఖ్ అంబాల కిరణ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ హై కోర్టు విద్యార్థుల నుండి కళాశాల యజమాన్యాలు తాత్కాలికంగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని ఇచ్చిన ఆదేశాన్ని, కాలేజీ యాజమాన్యాలు ఒక అవకాశంగా తీసుకొని విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో, ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాల్సి ఉన్నప్పటికీ, వాటి విడుదలపై తగిన దృష్టి పెట్టకపోవడం విచారకరం. విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, ఇప్పుడు కేవలం పేరు మాత్రంగా మారిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల్లో, ఆ విద్యార్థులు కళాశాలలకు ఫీజులు ఎలా చెల్లించగలరు అనే ప్రశ్న తీవ్రంగా ఎదురవుతోంది. ఇటీవల, ఫీజులు చెల్లించలేక హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజ్ లో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడికి తీవ్ర ఉదాహరణగా నిలిచింది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండటానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

**డిమాండ్లు**

ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి. విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలి. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులు వసూలు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలి. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు నిధులను క్రమంగా విడుదల చేస్తూనే, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదని పేర్కొన్నారు. విద్యా హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థలు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్, మెరుగు సాయికుమార్, ఫణీంద్ర , సాయి , హరిదాసు, సిద్దు, నాగేష్, సురేష్,ఈశ్వర్ తదితర విద్యార్థులు పాల్గొనారు.

## జగద్గిరిగుట్టలో వరుస చోరీలకు తెరదించిన పోలీసుల దాడి

**అలవాటు నేరస్థుడు అరెస్ట్**



**హైద్రాబాద్, 21 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ నగరంలోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో వరుస చోరీలకు పాల్పడుతున్న అలవాటు నేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం ఆధారంగా 21 ఏప్రిల్ 2026న కోవ్వూర్, సికింద్రాబాద్‌కు చెందిన మొహమ్మద్ సమీర్ ఖాన్ (24)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మద్యం, గంజాయి అలవాట్లకు బానిసై, విలాసవంతమైన జీవితం కోసం డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. జగద్గిరిగుట్టతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కూడా చోరీలు చేసినట్లు వెల్లడించాడు. పోలీసుల సమాచారం ప్రకారం, ఆల్విన్ కాలనీ పరిధిలో కేటీఎం బైక్, మొబైల్ ఫోన్లను దొంగిలించగా, శుభోదయ కాలనీ నుంచి టీవీఎస్ జూపిటర్ స్కూటీని అపహరించాడు. నిందితుడు ప్రధానంగా రాత్రి సమయంలో పార్క్ చేసిన వాహనాలు, లాక్ చేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగలగొట్టి లేదా ఓపెన్ హౌస్‌లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడేవాడు. నిందితుడి వద్ద నుంచి ఒక సామ్‌సంగ్ మొబైల్ ఫోన్, ఒక ఓపో మొబైల్ ఫోన్, ఒక టీవీఎస్ జూపిటర్ స్కూటీ, ఒక కేటీఎం 200 బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బైకులు నిందితుడి ఇంటి వద్ద నుంచే పట్టుబడ్డాయి. దర్యాప్తులో నిందితుడు గతంలో మాధాపూర్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, ఎస్.ఆర్.నగర్, బేగంపేట్, అల్లాపూర్ ప్రాంతాల్లో అనేక చోరీ కేసుల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు గుర్తించారు. జగద్గిరిగుట్ట పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎంప్లాయిస్ కాలనీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని అధ్యక్షులు సంపత్ - హామీ**



**హసన్‌పర్తి, 21 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంప్లాయిస్ కాలనీలో నూతన కార్యవర్గాన్ని మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సభ్యుల సమక్షంలో శాంతియుత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో నాయకత్వంపై ఏకాభిప్రాయం వ్యక్తమవడంతో అన్ని పదవులకు ఏకగ్రీవంగా ఎంపికలు జరిగాయి. నూతన అధ్యక్షుడిగా వేల్పుల సంపత్ బాధ్యతలు స్వీకరించగా, ఉపాధ్యక్షులుగా పప్పుల గణపతి, ప్రధాన కార్యదర్శిగా నీరజ సుధాకర్, కోశాధికారిగా వేల్పుల తిరిపతి, సహాయ కార్యదర్శిగా వెలగేటి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వేల్పుల సాయి, గుడికందుల కనకస్వామి, వెంగల చేంద్రమౌళి, అగ్గని రవెందర్, ఎలుకరాజు సాంబయ్యలను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేల్పుల సంపత్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అలాగే నూతన కార్యవర్గ సభ్యులందరూ కలసికట్టుగా పనిచేస్తూ కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని, శుభ్రమైన వాతావరణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక ఐక్యత పెంపొందింపులో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు సభ్యులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.ద

## "కె యు ఫార్మసీ కళాశాలకు 'బెస్ట్ ఫార్మసీ కళాశాల' అవార్డు - ప్రిన్సిపాల్ జే.కృష్ణవేణి స్వీకరణ"




**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల "బెస్ట్ ఫార్మసీ కళాశాల" గా ఏప్రిల్ 18 వ తేది హైదరాబాద్ లోని ప్రైమ్ 9 ప్లస్ మీడియా సంస్థ నుంచి "ఎక్సెలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు" కు ఎంపిక అయినట్టు, ఈ అవార్డు ను హైదరాబాద్ లో 18 వ తేదిన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో అవార్డు ను ప్రిన్సిపాల్ జే.కృష్ణ వేణి అందుకున్నారు, వైస్ ఛాన్సలర్ ను మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసారు, వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి బోధనా, బోధనేతర సిబ్బంది ని అబినందించారు, ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తో పాటు డీన్ ఆచార్య ఎన్.ప్రసాద్, ఆచార్య గాదె సమ్మయ్య, ఆచార్య స్వరూప రాణి, డాక్టర్ షాయెద ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల వివాదం తేలకముందే..

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎలా**

**మే లో ఎన్నికల దిశగా కసరత్తు బీసీ రిజర్వేషన్లపై పీటముడి**

**వీడకుండానే మరోసారి ముందుకు**

**ఎస్ఈసీకి సమాచారమిచ్చిన ప్రభుత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్ 21/2026(జై భీమ్ న్యూస్)**

అనాలోచిత నిర్ణయాలతో సెప్టెంబర్‌లో ఒకసారి ప్రయత్నించి చేతులు కాల్చుకున్న ప్రభుత్వం తాజాగా మళ్లీ మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సమాయత్తమవుతున్నది.బి నాటి అడ్డంకులు పూర్తిగా తొలగిపోనప్పటికీ, ఎన్నిక ల నిర్వహణకు సిద్ధం కావాలన్న ప్రభుత్వ సంకేతాలతో ఎస్ఈసీ కూడా సన్నద్ధమవుతున్నది. తొలుత ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం లేవనెత్తిన బీసీ రిజర్వేషన్ల అంశమే ప్రధాన సమస్యగా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఈ వివాదం పరిష్కారం కాకముందే ముందుకు వెళ్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, బీసీ రిజర్వేషన్ల శాతంపై హైకోర్టులో కేసు తేలాల్సి ఉన్నది. బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయడం, న్యాయపరమైన చిక్కులను అధిగమించడం ప్రభుత్వానికి కత్తిమీద సాముగా మారింది. ఇవి పరిష్కరించకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారనేది ఉత్కంఠ రేకెత్తిస్తుండగా, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం చేసిన సూచనలు అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో మరోసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**23న క్యాబినెట్‌లో నిర్ణయం**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు చివరిసారిగా 2019 మేలో జరిగాయి. 2019 మే 6, 10, 14వ తేదీల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, జూన్‌లో ఎంపీపీలు, జడ్పీ చైర్మన్ల ను ఎన్నుకున్నారు. గత సంవత్సరం జూన్‌లో వారి పదవీకాలం ముగిసింది. నాటినుంచి స్పె షల్ ఆఫీసర్ల పాలనతో నెట్టుకొస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 29న రెండు దశల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీచేసి నామినేష న్లు స్వీకరించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణలో భాగంగా అక్టోబర్ 9న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత న్యాయస్థానం అనుమతితో ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. రిజర్వేషన్ల విధానం ప్రకటించిన అనంతరం అందుకు అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 23న క్యాబినెట్‌లో చర్చిం చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. మంత్రివర్గ సమావేశంలో రిజర్వేషన్లపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఇదే విషయాన్ని హైకోర్టుకు నివేదించనున్నట్టు తెలిసింది. ఈలోగానే ఎన్నికల ప్రక్రియలో వేగం పెంచేందుకుగాను గత సంవత్సరం జూలై 10వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 5 నాటికి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన జాబితాతో నియోజకవర్గాల వారీగా అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తిస్తున్నారు. వీటి ఆధారంగానే తుది ఓటర్ల జాబితా ఖరారు చేసి ఎన్నికలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 23ను గడువుగా నిర్దేశించారు. ప్రభుత్వ ఆమోదం తర్వా త జాబితాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శిస్తారు. ఇదే జాబితాతో ఎన్నికలకు వెళ్లనున్నారు.

**తగ్గిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు**

ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత శాఖలు ప్రక్రియను ప్రారంభించి 5,773 ఎంపీటీసీ, 566 జడ్పీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు వీలుగా జాబితాను సిద్ధంచేసి సీఎస్‌కు సమర్పించారు. సీఎస్ ఈ నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల తగ్గుదల వెనుక మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా గుర్తిం చి జిల్లా పరిషత్ జాబితా నుంచి తొలగించడంతోపాటు, పలు జిల్లాల్లో మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో కొన్ని గ్రామాలు విలీనం కావ డం కారణం. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. 2019 తర్వాత సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అనేక గ్రామ పంచాయతీల విలీనంతో 44 ఎంపీటీసీలు, నాలుగు జడ్పీటీసీ, మరో 4 ఎంపీపీ స్థానాలు తగ్గిపోయాయి. ఎన్నికలకు వెళ్లాలంటే ముందు గా బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి కసరత్తు చేయలేదు. ప్రస్తుతం రిజర్వేషన్ల వివాదం హైకోర్టు లో విచారణలో ఉన్నది. తాజాగా అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి పోలింగ్ కేంద్రాల వారీగా జత చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే జరిగితే తీవ్రమైన ఎండలు ఠారెత్తించే మే నెలలో ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పోలింగ్ శాతం తగ్గడం, వేసవిలో నీటి ఎద్దడి, కరువు పరిస్థితుల వంటివి కూడా ప్రభావం చూపే అవకాశం ఉన్నది.


# కందిపప్పు ఎక్కువగా తింటున్నారా..?



మన రోజువారీ ఆహారంలో కందిపప్పు ముఖ్యమైన భాగం. కానీ ఇటీవల కల్తీ సమస్య పెరుగుతోంది. కేసరి పప్పు అనే విషపూరిత పదార్థాన్ని దీనిలో కలుపుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది అంటున్నారు. మన ఆహారంలో ప్రోటీన్ ప్రధానమైన మూలకం. దానిని అందించేవాటిలో పప్పులు ముఖ్యమైనవి. అందులోను కందిపప్పు మన భారతీయ ఆహారంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా సాంబార్, పప్పు కూరలు తయారీలో కందిపప్పును విరివిగా ఉపయోగిస్తారు. కానీ ప్రస్తుతం దీనిలో కల్తీ ఎక్కువవుతోందనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. కేసరి పప్పు అనే రసాయనాలతో కలిపిన విషపూరిత పప్పును కల్తీ చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన నరాల సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయని సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మార్కెట్లో లభిస్తున్న కందిపప్పులో కేసరి పప్పును కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కేసరి పప్పు అసలు తినదగినది కాదు. ఇది కలుపు మొక్కల ద్వారా పెరిగే విషపూరిత పదార్థం. దీన్ని తినడం వల్ల ముఖ్యంగా నరాల వ్యవస్థ దెబ్బతింటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఎక్కువగా తింటే కాళ్లు, చేతులు నెమ్మదిగా పని చేయకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి. దీన్ని లాథిరిజం అని అంటారు. దీని ప్రభావం శాశ్వతంగా ఉండే ప్రమాదం ఉంది. అంతేకాకుండా వ్యాపారులు ఈ కల్తీని గుర్తించకుండా ఉండేందుకు టార్ట్రాజిన్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది ఒక రకమైన ఆహార రంగు పదార్థం. దీని వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీని ప్రభావం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. కేసరి పప్పు కందిపప్పును పోలి ఉంటుంది. అయితే దీని ఆకారం కొద్దిగా చతురస్రాకారంలో ఉంటుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ధరలో లభించే ఈ పప్పును అసలు కందిపప్పులో కలిపి అమ్ముతున్నారు. దీని వల్ల సామాన్య వినియోగదారులకు అసలు పప్పు, కల్తీ పప్పు మధ్య తేడా గుర్తించడం కష్టం అవుతోంది. ఇంట్లోనే ఈ పప్పులో కల్తీ ఉందో లేదో సులభంగా పరీక్షించుకోవచ్చు. దాని కోసం 10 గ్రాముల పప్పులో 25 మి.లీ నీరు పోసి, 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం వేసి చిన్న మంటపై వేడి చేయాలి. ఈ ప్రక్రియలో నీటి రంగు మారితే ఆ పప్పులో కల్తీ ఉందని అర్థం. అదనంగా సహజమైన కందిపప్పు నునుపుగా, గుండ్రంగా ఉంటుంది. అయితే కల్తీ కేసరి పప్పు త్రికోణాకారంలో ఉండే అవకాశం ఉంది. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించకూడదు. కాబట్టి నాణ్యమైన పప్పును మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన బ్రాండ్‌లను ఉపయోగించడం ఉత్తమం. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాణ్యత లేని పప్పులను కొనడం మానుకోవాలి.

# పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాధించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రుల్లైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రుల్లైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.



# డయాబెటిస్‌తో బాధపడుతున్నారా?

డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఈ రోజుల్లో హై బ్లడ్ షుగర్ లేదా డయాబెటిస్ సమస్య చాలా మంది వ్యక్తులలో సాధారణంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి పూర్తి స్థాయి నివారణ లేనప్పటికీ దీనిని నియంత్రణలో ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రజలు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తారు. మందులను ఉపయోగిస్తారు. అయితే, ఉల్లిపాయలు తినడం కూడా డయాబెటిస్ రోగులకు చాలా మేలు చేస్తుందని తెలుసుకోవడం ఆసక్తికరం. ఉల్లిపాయల్లో ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలను వంటలో వేసుకుని తినవచ్చు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఇంకా ఎక్కువ ప్రయోజనకరం. ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ గుణం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని తినడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచవచ్చు. ఉల్లిపాయల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు డయాబెటిస్ రోగులకు ఎంతో మంచివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచవు. అందుకే పచ్చి ఉల్లిపాయలను నిరభ్యంతరంగా తినవచ్చు. డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఉల్లిపాయల్లోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, బరువు తగ్గడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ రోగులకు బరువును నియంత్రణలో ఉంచడం చాలా ముఖ్యం. ఉల్లిపాయలను కూరల్లో




కలిపి తినవచ్చు లేదా సలాడ్‌గా కూడా సేవించవచ్చు. డయాబెటిస్ రోగులకు ఉల్లిపాయలు ఒక సహజమైన, సులభమైన ఆహార ఎంపిక. దీనిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని డైట్‌లో చేర్చే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా డయాబెటిస్‌తో ఇబ్బంది పడేవారు వైద్యులను సంప్రదించాలి.

## ఈ పండ్లు తింటే జీవితంలో గుండె జబ్బులు రావ్..




నేటి కాలంలో ఆరోగ్యంగా ఉండటం పెను సవాలే. మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరినీ హడలెత్తిస్తున్న ప్రధాన సమస్య గుండె సమస్యలు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీని బారీన పడుతున్నారు. నేటి కాలంలో గుండె జబ్బులు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది యువకులు, చిన్న పిల్లలు గుండెపోటుతో మృతి చెందారు. దీనికంతటికీ కారణం మనం తినే ఆహారాలు, మన తప్పుడు దిన చర్యలే కారణం అంటున్నారు నిపుణులు. అందువల్ల, గుండె జబ్బులను ఎలా నివారించాలో నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదం చేసే 5 రకాల పండ్లు ఇవే. బ్లూబెర్రీస్‌లో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తపోటును తగ్గిస్తుంది. యాపిల్స్ ఫైబర్ కు మంచి మూలం. గుండెకు మేలు చేసే ఆమ్లాలు ఇందులో అధికంగా ఉంటాయి. పెక్టిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దానిమ్మ గుండె ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. దీన్ని తినడం రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్తపోటు, పిత్త సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.అవకాడోలు గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటాయి. ఇందులో పొటాషియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇందులో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడో జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.

## ఈ సమస్యలు ఉన్నవారు ఖర్జూర పండ్లు తినకూడదు..!



ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలని సలహా ఇస్తారు. నిపుణుల ప్రకారం.. సరైన మోతాదులో సరైన విధానంలో ఈ డ్రై ఫ్రూట్‌ను ఆహార ప్రణాళికలో చేర్చుకుంటే మొత్తం ఆరోగ్యం చాలా వరకు మెరుగుపడుతుంది. అయితే, ఖర్జూరం తినడం వల్ల కొందరి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కూడా పడవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాల్లో ఈ వారు ఖర్జూరాన్ని ఆహారంలో తీసుకోకుండా ఉండాలి. ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. అలాగే, అధిక మోతాదులో ఖర్జూరం తీసుకోవడం వల్ల మీ బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఊబకాయం నుండి విముక్తి పొందాలనుకుంటే ఖర్జూరం తినడం మానుకోవడం మంచిది. డయేరియా సమస్యతో బాధపడుతున్న రోగులు కూడా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకుండా ఉండాలి. ఖర్జూరంలో ఉండే కొన్ని పదార్థాలు డయేరియా సమస్యను మరింత పెంచే పని చేస్తాయి. అంతేకాకుండా అధిక మోతాదులో ఖర్జూరం తినడం వల్ల మలబద్ధకం సమస్య కూడా పెరగవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఆహారం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఇలాంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా ఖర్జూరం తినకూడదు. వైద్యుడి సలహా లేకుండా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకపోవడమే మంచిది. అంతేకాకుండా ఖర్జూరం తినడం వల్ల అలర్జీ ఉంటే ఈ డ్రై ఫ్రూట్‌ను మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. దీన్ని సమతుల్యంగా తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా చూద్దాం!

## రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?



దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, ఆపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# అల్లు అర్జున్ పేరు, ఫొటోల వాడకంపై ఢిల్లీ హైకోర్టు నిషేధం



**అల్లు అర్జున్ పేరు, వాయిస్, ఫొటోల ముందస్తు అనుమతి లేని వాడకంపై నిషేధం**

**వ్యాపార అవసరాల కోసం ఐకాన్ స్టార్ గుర్తింపును వాడుకోవడంపై మధ్యంతర ఉత్తర్వులు**

**అభ్యంతరకరమైన వెబ్‌సైట్లు, లింకులను 72 గంటల్లో తొలగించాలని ఆదేశం**

**ఇటీవలి కాలంలో పర్సనాలిటీ రైట్స్ కోసం కోర్టును ఆశ్రయిస్తున్న పలువురు ప్రముఖులు**

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, ఫొటో, వాయిస్‌తో పాటు ఇతర వ్యక్తిగత గుర్తింపులను ముందస్తు అనుమతి లేకుండా వ్యాపార అవసరాలకు వాడుకోవడంపై న్యాయస్థానం మధ్యంతర నిషేధం విధించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీల ద్వారా అల్లు అర్జున్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న పలు సంస్థలు, వెబ్‌సైట్లపై కఠిన ఆంక్షలు జారీ చేసింది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, కొన్ని వెబ్‌సైట్లు అక్రమంగా తన ఫొటోలతో కూడిన వస్తువులను విక్రయిస్తున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా తన వాయిస్‌ను క్లోన్ చేసి ఫేక్ కాల్స్ సృష్టిస్తున్నారని తెలుపుతూ అల్లు అర్జున్ కోర్టును ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్న అసభ్యకరమైన కంటెంట్‌ను కూడా ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. "విజేత" సినిమాలో బాలనటుడిగా మొదలైన ఆయన ప్రయాణం "పుష్ప" సిరీస్‌తో జాతీయ స్థాయికి చేరిందని, ఆయనో కమర్షియల్ సక్సెస్ సాధించిన గౌరవప్రదమైన నటుడని న్యాయమూర్తి ప్రశంసించారు. అల్లు అర్జున్ పేరు, ఆహార్యం, వాయిస్, డైలాగ్ డెలివరీ, సిగ్నేచర్ వంటివి ఆయనకు మాత్రమే ప్రత్యేకమైనవని స్పష్టం చేశారు. వీటిని అనుమతి లేకుండా వాడితే ఆయనకు తీరని నష్టం వాటిల్లుతుందని కోర్టు అభిప్రాయపడింది. అల్లు అర్జున్ గుర్తింపును ఉపయోగించి ఏఐ జనరేటెడ్ డీప్‌ఫేక్స్, ఫేస్ మార్ఫింగ్ వంటివి సృష్టించకూడదని, ఆయన ఫొటోలతో దుస్తులు, పోస్టర్లు అమ్మకూడదని కోర్టు స్పష్టం చేసింది. అభ్యంతరకరంగా ఉన్న లింకులు, వెబ్‌సైట్లను 72 గంటల్లోగా తొలగించాలని సంబంధిత సంస్థలను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 14, సెప్టెంబర్ 24వ తేదీలకు వాయిదా వేసింది. కాగా, ఇటీవలి కాలంలో తమ పర్సనాలిటీ రైట్స్‌ను కాపాడుకునేందుకు గౌతమ్ గంభీర్, నాగార్జున, కాజోల్, ఐశ్వర్య రాయ్, సునీల్ గవాస్కర్ తదితర ప్రముఖులు కూడా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి రక్షణ పొందారు.

# ఇక ఆరు రోజులే... చివరి దశకు రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్ చివరి అంకానికి చేరుకుంది. ఈ సినిమా చిత్రీకరణ మరో 6 రోజుల్లో పూర్తవుతుందని దర్శకుడు బుచ్చిబాబు స్వయంగా వెల్లడించారు. రామ్ చరణ్‌తో సెట్స్‌లో దిగిన సెల్ఫీని పంచుకుంటూ, "నాకు అత్యంత స్ఫూర్తినిచ్చిన పాత్ర.. నేను ప్రేమించే పెద్ది" అంటూ ఆయన తన అభిమానాన్ని చాటుకున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ఒక రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా. ఇందులో రామ్ చరణ్ 'పెద్ది' అనే టైటిల్ రోల్‌లో, మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ రస్టిక్ అవతార్‌లో పహిల్వాన్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం చరణ్ ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇటీవలే ఈ సినిమాలోని టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ప్రకటించింది. ఇప్పుడు ఆ చివరి పాట చిత్రీకరణ కూడా ముగింపు దశకు రావడంతో, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసి, సినిమాను 2026 జూన్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# నేను మలయాళీని కాదు.. తమిళ అమ్మాయిని: పాత వివాదంపై సాయి పల్లవి

**తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారని గతంలో సాయి పల్లవికి ప్రశ్న**

**తాను తమిళ అమ్మాయిని అని తెలిపిన పల్లవి**

**తన మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పానన్న పల్లవి**

**ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం తనకు లేదని వ్యాఖ్య**

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన 'రామాయణ' చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, "మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?" అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. "ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. నేను కోయంబత్తూరులో పుట్టి పెరిగాను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం నాకు లేదు" అని సాయి పల్లవి వివరణ ఇచ్చింది.